17వ నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,13 మే 2024


## కాలుకి సర్జరీ చేయించుకున్నా ఎన్నికల విధులకు హాజరైన సెక్టార్ అధికారికి జిల్లా కలెక్టర్ అభినందనలు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఎన్నికల విధులు నిర్వహించాలనే సంకల్పంతో శస్త్రచికిత్స చేయించుకున్న ఒక ఉద్యోగి తన బాధను సైతం దిగమింగి ఎన్నికల విధులకు సిద్ధమైన సంఘటన జిల్లా కలెక్టర్ ను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. విధుల నిర్వహణకు ఏమైనా ఇబ్బందీ పడతరేమో ఒకసారి ఆలోచించుకోడని వేంకటేశ్వర రావు ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అడిగారు.ఆదివారం స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఉద్యోగి వెంకటేశ్వరరావు తన కాలుకి బోన్ సర్జరీ చేయించుకున్నా కూడా ఎన్నికల్లో సెక్టార్ అధికారిగా విధులు నిర్వహించడానికి ఎంతో ఉత్సాహంగా ముందుకు వచ్చిన వెంకటేశ్వరరావును జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అభినందించారు. ఎన్నికల విధులకు ఏదో సాకుతో తప్పించుకోవాలానే చాలా మంది చూస్తుంటారని అయితే వేంకటేశ్వరరావు ఎన్నికల విధులు పట్ల చూపిన నిబద్ధత అభినందించతగ్గదని అన్నారు.

### నేటి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం

# విస్తృత ఏర్పాట్లు

**16.37లక్షల మంది ఓటుహక్కు వినియోగించుకునేందుకు 1744 పోలింగ్ కేంద్రాలు ..**

**ఏలూరు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**






**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లాలో సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈనెల 13వ తేదీన జరిగే పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఆదివారం ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1744 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 13వ తేది సోమవారం ఉదయం 7.00 గంటల నుంచి పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలను 193 సెక్టార్లుగా విభజించి ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవిఎం, వివిప్యాట్ లతోపాటు న్యాయబద్దమైన పత్రాలు, ఇతర ఎన్నికల సామాగ్రిని ఆయా నియోజకవర్గాల ప్రధాన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే ప్రక్రియ ఆదివారం ఉదయం ప్రారంభమయిందన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు 16 వేల మంది సిబ్బందితోపాటు 4 వేల మంది పోలీస్ సిబ్బందితో కలిపి 20 వేల మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. 7 నియోజకవర్గాలకు సంబంధించి ఆయా ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరేందుకు ఆర్ టి సి బస్సు సౌకర్యాలను కూడా కల్పించిందన్నారు. ఎన్నికల సామాగ్రి తీసుకున్న పిదప వాటిని పరిశీలించుకుని ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధిత సిబ్బంది వారికి కేటాయించిన వాహనాల్లో వెళ్లడం జరుగుతుందన్నారు. సాయంత్రానికి పోలింగ్ కేంద్రానికి సంబంధిత టీమ్ చేరుకుని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను చేసుకోవడం జరుగుతుందన్నారు.

అందుకు సంబంధించిన లేఅవుట్ ను కూడా వారికి అందించడం జరిగిందన్నారు. ఈనెల 13వ తేదీ సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహించడం జరుగుతుందని అనంతరం ఉదయం 7.00 గంటల నుండి పోలింగ్ ప్రారంభమౌతుందన్నారు. ఈవిఎం ల్లో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు సెక్టార్ ఆఫీసర్ల వద్ద ఒకటి నుంచి రెండు ఈవిఎంలు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. మాక్ పోల్ జరిగే సమయంలోకూడా ఇటువంటి సమస్య వస్తే వెంటనే వాటి స్థానంలో మరో ఈవిఎం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లు దూరంగా ఉండటం మూలంగా అక్కడ సెక్టార్ ఆఫీసర్ల వద్ద రెండు స్పేర్ ఈవిఎంలను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా ఈవిఎం సాంకేతిక సమస్య తలెత్తితే 15 నుండి 20 నిషాలలోపు వాటి స్థానంలో ఏదో ఒకటి ఉంచడం జరుగుతుందన్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రతి నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున బెల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఐటిడిఏ పరిధిలో ఫోన్ సౌకర్యం లేని 13 పోలింగ్ కేంద్రాల్లో విహెచ్ఎఫ్ సెట్లను ఏర్పాటు చేయడంతోపాటు మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రఫీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడమైనదన్నారు. పోలవరం నియోజకవర్గంలో కుక్కునూరు మండలం కాకీస్నూర్ గ్రామానికి గోదావరి నది దాటి వెళ్లవలసివున్నందున ఎన్నికల సిబ్బందికి బోటు సౌకర్యం కల్పించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, త్రాగునీరు సౌకర్యంతోపాటు హెల్త్ క్యాంపు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా విభిన్న ప్రతిబావంతులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు 1100 వీల్ చైర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.జిల్లాలో 1744 పోలింగ్ కేంద్రాల్లో 1069 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ పరిశీలనకు లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు.జిల్లాలో ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్స్ పంపిణీ చేశామని, అయితే ఇంకా ఎవరైన మిస్ అయితే సంబంధిత బి ఎల్ వో వద్ద పొందవచ్చునన్నారు.జిల్లాలో 15 వేల 615 మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కున్నారన్నారు. హెూమ్ ఓటింగ్ ద్వారా 896 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు 150 ఆర్టీసీ,350 ప్రైవేటు వాహనాలు ఏర్పాటుచేశమన్నారు.జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7 మహిళా పోలింగ్ కేంద్రాలు,పోలవరం,చింతలపూడి నియోజక వర్గాల్లో యువత కోసం రెండు ప్రత్యేక కేంద్రాలు,విభిన్న ప్రతిభ వంతులకు ఏలూరు,దెందులూరు నియోజక వర్గాల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ప్రతిఒక్క ఓటు ప్రధానమే... ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటుహక్కు వినియోగించుకున్నపుడే ప్రజాస్వామ్య పండుగకు సార్థకత చేకూరుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కఓటు విలువైనదని అది ప్రజాస్వామ్యానికి పునాది అన్నారు. ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని భాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఓటరు మే 13వ తేదీ సోమవారం పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటుహక్కు వేసే బాధ్యతను నెరవేర్చాలన్నారు. ఓటుహక్కు వినియోగంపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2 వేలకు పైగా స్వీప్ కార్యక్రమాలు, కళాజాతలు నిర్వహించామన్నారు.జిల్లా కలెక్టర్ వెంట ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యం. ముక్కంటి. జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, నగరపాలక సంస్థ కమీషనరు యస్ వెంకటకృష్ణ, డిపివో టి. శ్రీనివాస విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## కాకసనూరు పోలింగ్ సిబ్బందికి గిరిజన సాంప్ర దాయంలో ఘన స్వాగతం



**ఏలూరు/పోలవరం,మేజర్‌న్యూస్ :** కాకసనూరు పోలింగ్ సిబ్బంది ఊహించని పరిణామం ఎదుర్కొన్నారు. గిరిజనులు సాంప్రదాయ బద్దంగా పోలింగ్ సిబ్బందికి ఘనస్వాగతంపలికిపూలమాల వేశారు. ఏలూరుజిల్లా, కోయిదా గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నకాకసనూరు పోలింగ్ కేంద్రం జిల్లా కేంద్రానికి సుమారు 180 కిమీ దూరంలో ఉంది. ఐ.టి.డి.ఎ కోట రామచంద్రపురంలో పరిధిలో ఉన్న ఈ పోలింగ్ కేంద్రం జిల్లాలో ఉన్న 1744 పోలింగ్ కేంద్రాలలో ఒకటి. కాకసనూరు తండా గోదావరి నది మధ్యలో ఉండడం వలన సరైన రవాణా సౌకర్యం, విద్యుత్ సదుపాయం లేదు, చరవాణి కూడా పనిచేయదు. బాహ్యప్రపంచంతో సంభందం లేని కాకసనూరులో కొండరెడ్డి గిరిజన తెగ చెందిన పి.వి.టి.జి గ్రూపు వారు నివాసముంటారు. సార్వత్రిక ఎన్నికల దరిమిలా ఈ ప్రాంతంలో పేరంటలపల్లి, టేకుపల్లి, కాకసనూరు ఆవాసాలకు చెందిన 472 మంది ఓటర్లు ఇక్కడున్నారు.

సిబ్బంది ఎన్నికల విధుల నిమిత్తం కాకసనూరు చేరుకోవాలంటే గోదావరి నది మీద పడవ ప్రయాణం తప్పనిసరి. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లాలో పోలింగ్ సజావుగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేసినా కాకసనూరులో ఎన్నికల విధులు నిర్వహించడం సిబ్బందికి ఇబ్బందే అని చెప్పచ్చు. అయితే కాకసనూరు గ్రామానికి ఎవరైనా ఇతర ప్రాంతాల నుంచి వస్తే ఈ ప్రాంత కొండారెడ్డి గిరిజన తెగవారు వారి సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలకడం అనవా యితీ. అయితే పోలింగ్ రోజుకి ఒకరోజు ముందుగా పోలింగ్ సిబ్బంది కాకసనూరు గిరిజన తండాకు వస్తారని తెలుసుకొని సిబ్బంది వచ్చేవరకు ఎదురు చూసారు. రాత్రి సమయం అని కూడా చూడకుండా పోలింగ్ సిబ్బంది రాకకోసం ఎదురుచూసి గిరిజన సంప్రదాయాల ప్రకారం ఘన స్వాగతం పలికి సత్కరించారు. సందర్భంగా పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారి ప్రసాద్, ఎన్నికల సిబ్బంది కాకసనూరు గిరిజనులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్, సబ్ ఇన్స్పెక్టర్ యు. లక్ష్మీనారాయణ, విస్తరణ అధికారి యం. శ్రీహరి తదితరులు ఉన్నారు.

## శ్రీవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి శేష సాయి





**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం చిన్నవెంకన్నసన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి శేష సాయి దంపతులు ఆదివారం ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు అధికారులు తూర్పు గోపురం వద్ద పూర్ణ కుంభ స్వాగతం పలుకుగా స్వామివారిని పద్మావతి ఆండాళ్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేదవచార వచనాలు పలికి స్వామివారిశేషవస్త్రాన్ని ప్రసాదాలను సమర్పిం చారు.దేవాలయఏఈఓ మెట్టుపల్లి దుర్గారావు శ్రీవారి జ్ఞాపికను అందించారు.

## ఎన్నికల సిబ్బంది సౌకర్యాలను ఆరా తీసిన జిల్లా కలెక్టర్

**భోజనం ఏర్పాట్లను పరిశీలించి ఆహార పదార్థాలు వడ్డింపు**

**ఎన్నికల సిబ్బందితో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్**





**ఏలూరు,మేజర్ న్యూస్ :** సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికలకు సంబం ధించి ఏలూరులోని కోటదిబ్బలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌నుజిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వర్తించడానికి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వచ్చిన పోలింగ్ సిబ్బందికి ఎటువంటి సమస్యలు లేకుండా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ పనితీరును ఆయన పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కోసం సెక్టర్ వారిగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్దకు వెళ్లి ఎన్నికల సామాగ్రి తీసుకునే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను అనుగుణంగా పిఓలు ఏపీవోలకు అందించిన శిక్షణా కార్యక్రమంలో పేర్కొన్న అంశాలను తు.చ. తప్పకుండా పాటించాలని పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి ఏర్పాటుచేసిన భోజన కౌంటర్ల కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు ఉదయం అల్పాహారం ఎన్నికల సిబ్బందికి అందిందా లేదాఅనిఆరా తీశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు పరిశీలిస్తూ ఆహార పదార్థాల నాణ్యత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అప్పటికే అక్కడ భోజనం చేస్తూ ఉన్న సిబ్బంది భోజన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురి సిబ్బందికి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్%ఎ% వడ్డించారు. వడ్డించడమే కాకుండా తను కూడా వారితో కలిసి భోజనం చేశారు. ఆపై ఎన్నికల సిబ్బందితో జిల్లా కలెక్టర్ భోజనం చేసి ఆహార పదార్థముల వడ్డించడం చూచి ఎన్నికల సిబ్బంది ఆనందం పొందారు.

## పోలింగ్ సిబ్బంది నిబంధనలు పాటించాలి

**ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరిష్**




**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** స్థానిక వైఎన్ఎం కళాశాల ఆవరణలో పోలింగ్ సిబ్బందికి నిర్వహిం చిన సమావేశంలో ఆర్డీవో ఎం అచ్యుత అంబరీష్ మాట్లాడారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమా వలిని కచ్చితంగా పాటించాలని అన్నారు.ఏమైనా ఇబ్బందులు ఉంటేసంబంధిత అధికా రులకు సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

**ప్రశాంత వాతావరణంలో సహకరించాలి రాజకీయ పార్టీలకు, ప్రజలకు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి**





భీమవరం,మేజర్‌న్యూస్: పశ్చిమగోదావరి జిల్లాలో పోలింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, రాజకీయ పార్టీలు, ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.ఎస్ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన భీమవరం, ఉండి నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి సెక్టార్ల వారీగా ఈవీఎంలు, పోలింగ్ సామాగ్రి పంపిణీ, తదితర ఏర్పాట్లును ఆదివారం జిల్లా కలెక్టర్‌సుమిత్‌కుమార్‌స్వయంగా పర్యవేక్షించారు.13వ తేది సోమవారం జరగనున్న ఎన్నికల నిర్వహణకు సామగ్రి తరలింపు పూర్తి అయ్యింది. ఆదివారం ఉదయం నుండి ఎన్నికల విధులలో ఉన్న అధికారులు, సిబ్బంది ఎన్నికలసామగ్రిపంపిణీకేంద్రాలకు చేరుకున్నారు. తమకు ఎక్కడ నియామకం జరిగిందో తెలుసుకుని నియామక పత్రాలు అందుకోవడం, అనంతరం తమ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సామగ్రిని స్వీకరించారు.ఆచంటలో 19సెక్టార్లు, పాలకొల్లులో 21 సెక్టార్లు, నరసాపురంలో 16సెక్టార్లు,భీమ వరంలో 21 సెక్టార్లు, ఉండిలో 22 సెక్టార్లు, తణుకులో 23 సెక్టార్లు, తాడేపల్లిగూడెంలో 18 సెక్టార్లు ఏర్పాటు చేసారు.ఎన్ని కల సామగ్రి పంపిణీకి నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆచంటఎం.వి.ఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం డిగ్రీ కాలేజ్, నరసాపురం వై ఎన్ కాలేజ్, భీమవరం, ఉండి ఎస్ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, తణుకు జడ్పీహెచ్ఎస్‌బాయ్స్‌హైస్కూల్, తాడేపల్లిగూడెం జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్ లో ఏర్పాటు చేయడం జరిగింది. నియోజకవర్గాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఇవీఎంల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఉదయం 6:30 గంటలకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూములను తెరిచి ఈవీఎంల పంపిణీ ప్రారంభించారు. ఇవిఎం పంపిణీ ప్రక్రియను నిర్విఘ్నంగా పూర్తి చేశారు. సిబ్బందికి సెక్టార్, రూట్లు వారీగా బస్సులు ఏర్పాటు చేసి బందోబస్తుతో పోలింగ్ కేంద్రాలకు పంపించడం జరిగింది.జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుమిత్ కుమార్ జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సివి ప్రవీణ్ ఆదిత్య, ఏపీ టూరిజం ఆర్.జె.డి, ఆచంట నియోజకవర్గం రిటర్నింగ్ అధికారివి.స్వామి నాయుడు, కెఎల్ఆర్సి డిప్యూటీ కలెక్టర్, పాలకొల్లు రిటర్నింగ్ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, నరసాపురం సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.అచ్యుత్ అంబరీష్, భీమవరం ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాసులు రాజు, తణుకు మున్సిపల్ కమిషనర్ రిటర్నింగ్ అధికారి బి.వెంకటరమణ, తాడేపల్లిగూడెం ఆర్డిఓ, రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య తమ నియోజకవర్గాలలో పర్యవేక్షణ చేసి అన్ని సజావుగా ఏర్పాటు చేసారు. సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సైతం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆహార, వసతి సౌకర్యాలతో సహా అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం జరగనున్న పోలింగ్ రోజు ఉదయం ఏజెంట్ల సమక్షంలో నమూనా వోటింగ్ నిర్వహించి ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు. జిల్లాలో మొత్తం 10,233 మంది సిబ్బంది, 1,700 మంది పోలీసులు, 10 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలు, రాష్ట్ర బలగాలు రెండు ప్లాటూన్లు, 1200 మంది ఎన్ సిసీ, ఎన్ ఎస్ ఎస్, ఎక్స్ సర్వీస్ మెన్, రిటైర్డ్ ఉద్యోగులు ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు అయ్యారు. జిల్లాలో మొత్తం 14,72,923 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకొనున్నారు. ఇందులో 7,21,532 మంది పురుషులు, 7,51,313 మంది స్త్రీలు, 78 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. ఆచంట నియోజకవర్గంలో మొత్తం 1,80,017 ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 88,881 మంది, స్త్రీలు 91,132 మంది, థర్డ్ జెండర్లు 4 మంది, పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 1,95,057 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 95,742 మంది, స్త్రీలు 99,309 మంది, థర్డ్ జండర్స్ 6 మంది, నరసాపురం నియోజకవర్గంలో మొత్తం 1,70,448 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 84,667 మంది, స్త్రీలు 85,781 మంది, భీమవరం నియోజకవర్గంలో మొత్తం 2,53,116 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,22,790 మంది, స్త్రీలు 1,30,275 మంది, థర్డ్ జెండర్స్ 51 మంది, ఉండి నియోజకవర్గంలో 2,24,725 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,10,146 మంది, స్త్రీలు 1,14,577 మంది, థర్డ్ జెండర్స్ 2, తణుకు నియోజకవర్గంలో మొత్తం 2,34,575 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,14,435 మంది, స్త్రీలు 1,20,135 మంది, థర్డ్ జెండర్స్ 5, తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో మొత్తం 2,14,985 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,04,871 మంది, స్త్రీలు 1,10,104 మంది, థర్డ్ జెండర్స్ 10 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో హింసకు తావులేని విధంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరి సహకారము అవసరమని, అలాగే ఎన్నికల్లో విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఇటువంటి లోటుపాట్లకు పావులేని విధంగా పోలింగ్ పూర్తి చేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు.

# దాతల సహకారంతో 24 వ రోజుకు చేరిన మజ్జిగ చలివేంద్రం



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో నిర్వహించే మజ్జిగ చలివేంద్రం 24వ రోజుకు చేరింది. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలీస్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రంలో నిర్విరామంగా మజ్జిగ వితరణ జరుగుతుంది. ఈరోజు 30వ వివాహ వార్షికోత్సవ జరుపుకుంటున్న పెనుగొండ శ్రీనివాసరావు, సత్యవేణి దంపతులు సౌజన్యంతో మజ్జిగ వితరణ జరిగిందని దాతల సహకారంతో మరిన్ని రోజులు ఇదేవిధంగా కొనసాగిస్తామని ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నన్నా సుందర్రావు తెలియజేశారు. వాసవి క్లబ్ అధ్యక్షులు నున్న ఆనంద్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు వాసవి క్లబ్. అటువంటి వాసవి క్లబ్ ఉన్నతకి ప్రతి ఒక్కరు సహకరిస్తున్నారని వారి సహాయ సహకారాలతో ప్రతి సంవత్సరం 60 రోజుల పాటు నిర్విరామంగా మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నామని దానికి కొనసాగిస్తూ గ్రేటర్స్ కమిటీ వారి సహకారంతో ముందుకు పోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పులపర్తి మల్లికార్జున రావు, కొల్లా సురేష్, చలంచర్ల గుప్త, రమేషు, రాజా, అనిల్, కృష్ణమోహన్, కొలువురు వాసవి క్లబ్ నెంబర్ పాల్గొన్నారు

# వైభవముగా మల్లన్న పల్లకి ఉత్సవం



**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయానికి ఉప ఆలయమైన శ్రీ భ్రమరాంబక మలేశ్వర స్వామి వారి పల్లకి ఉత్సవాన్ని కనుల పండుగ ఆదివారం నిర్వహించారు. ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించినన్నట్లు ఆలయ అర్చకులు రాఘవస్వామి తెలిపారు. గ్రామ పురవీధులలో భక్తులు స్వామి వారికి పూలు పళ్ళు హారతులు అందించి స్వామివారి దర్శన భాగ్యాన్ని పొందారు

# ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాలి

### పోలీసు సిబ్బందికి, అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశం

**దెందులూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర శాసన సభ, లోక్ సభలకు సాధారణ ఎన్నికలుజరుగనున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి దెందులూరు నియోజక వర్గం సందర్శించి అధికారులకు, సిబ్బందికి విధులపై బ్రీఫింగ్ ఇచ్చారు ఎన్నికలు ప్రశాంతముగా, పారదర్శకముగా నిర్వహించుటకు ఆదివారం ఎస్పీ దెందులూరు నియోజక వర్గాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించి, నియోజక వర్గాలలో గల అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద, ఇతర ముఖ్య ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితోమాట్లాడారు. ఉన్నతాధికారులసమక్షంలో ఎన్నికల విధులను కేంద్ర ఎన్నికల సంఘం నిభందనలు అనుసరించి నిర్వహించాలని, విధులు కేటాయించినచోటతమవిధులను పారదర్శకముగా నిర్వర్తించాలని, ఎవరైనా విధులలో అలసత్వం వహిస్తే, తక్షణం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ జరుగుతున్న సమయం లో అప్రమత్తంగా ఉంటూ, ఓటర్లతో పాటుగా వృద్ధులకూ, బాలింతలకూ, మహిళలకూ ఏ ఇబ్బందులు తలెత్తకుండా,



స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తోడ్పడాలి అని తెలిపారు. పోలింగ్ సమయంలో అధికారి చేయవలసిన చేయకుడని విషయాలపై అధికారులకు బ్రీఫింగ్ ఇచ్చిన జిల్లా ఎస్పీమేరీ ప్రశాంతి. ఈ కార్యక్రమములో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎన్. సూర్య చంద్ర రావు, ట్రైనీ ఎస్పీ లు, ఎస్. బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు, నూజివీడు డిఎస్పీలక్ష్మయ్య, పెదవేగిసిఐకెశ్రీనివాసు కుమార్, దెందులూరు ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

# పెదవేగి మండల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఐజీ,ఎస్పీ

**పెదవేగి, మేజర్ న్యూస్:** ఈనెల 13వ తేదీ సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు రేంజ్ ఐజి జి వి జి అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి కలిసి పెదవేగి మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా జరుపుట కొరకు ఏర్పాటు చేసిన విషయాలను గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు, మహిళలు, వృద్ధులు వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి అధికారులు సహాయ సహకారాలు అందించాలనిసూచించారు. పోలింగ్ కేంద్రాలలోకి సెల్ఫోన్లను అనువదించరాదని, పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు పాటించి త్రోపులాట జరగకుండా నిరోధించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ ప్రచారాలు గాని రాజకీయ చిహ్నాలను కలిగి ఉండే వారిని వెంటనే వారిని దూరంగా పంపించివేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి సుమారు 100 మీటర్లు, 200 మీటర్లు దూరంలో ముగ్గుతో మార్క్ వేసి ప్రజలకు ఏదైనా ఓటర్ స్లిప్ ఇవ్వాలి అంటే 200 మీటర్ల



దూరంలోనే రాజకీయ పార్టీలు తెల్ల కాగితంపై ఇచ్చేలా చూడాలని, ఓటర్ స్లిప్ పేరుతో రాజకీయ చిహ్నాలు ఉన్నటువంటి వాటిని అనుమతించరాదని కోరారు. తెల్ల కాగితంపై మాత్రమే ఉన్న సమాచారం ఓటర్లను లోనికి అనుమతించాలని, అధికారులు ఏ విధమైన అలసత్వం లేకుండా ఉద్యోగ నిర్వహణ చేయాలని, ప్రజలతో అధికారులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని దశ దిశను ఏలూరు రేంజ్ ఐజి నిర్దేశించారు. ఐజి పర్యటనలో నూజివీడు డిఎస్పీ లక్ష్మయ్య, పెదవేగిఇన్స్పెక్టర్‌కే శ్రీనివాస్ కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పోలింగ్ సమయాన్ని గుర్తు చేసేలా కౌంట్ డౌన్ గడియారం

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రారంభం కానున్న దృష్ట్యా ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు కదలి వచ్చేలా జిల్లా యంత్రాంగం విన్నూత్నంగా ఆలోచన చేసింది. ప్రజలందరికీపోలింగ్ సమయాన్ని గుర్తుచేసేలా జిల్లా కలెక్టరేట్‌లో పెద్ద సైజులో డిజిటల్ విధానంలోకౌంట్‌డౌన్ గడియారాన్ని రాష్ట్ర తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వారు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రస్తుత ఎన్నికలలో ఓటర్లను




చైతన్యపరచి వోటింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలను చేపట్టింది. దీనిలో బాగంగా పోలింగ్ కు ప్రజలను సమాయత్తం చేసేందుకు కలెక్టరేట్ లో శనివారం నుండి కౌంట్ డౌన్ గడియారాన్నిరాష్ట్ర తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వారు ఏర్పాటు చేశారు. సోమవారం పోలింగ్ సమయానికి గడియారంలో సమయం పూర్తి అయ్యేలా టైం సెట్ చేశారు. ఈ పెద్ద సైజ్ డిజిటల్ గడియారాన్ని చూసేందుకు ప్రజలందరూ కలెక్టర్‌కు వస్తున్నారు.

# కొయ్యలగూడెంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు



**కొయ్యలగూడెం, మేజర్‌న్యూస్:** కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో ఉన్న 192,193,194,195 పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎన్నికల పరిశీలకులు ఎస్.ఎ. రామన్ పరిశీలించారు. ఈ పరిశీలనలో బాగంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఎన్నికల కమీషన్ పోలింగ్ బూత్ లలో ఏర్పాటుపై ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను ఆయన క్షుణంగా పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటును వినియోగించుకోవడానికి అలాగే దివ్యాంగులైన వారికి వీల్ చైర్స్ లలో తీసుకువెళ్లడానికి ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు. త్రాగునీరు, విద్యుత్, షామియానా ఏర్పాట్లును పరిశీలించారు.

# ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన పరిశీలకులు రామన్



**నూజివీడు, మేజర్‌న్యూస్:** .నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం ఎన్నికల సాదారణ పరిశీలకులు ఎస్.ఎ. రామన్ పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించే వాహనాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈవిఎంలను, వివిప్యాట్‌లను, బ్యాలెట్ పత్రాలను పోలింగ్ ఇతర సామాగ్రిని, పివోలు, ఎపివోలుచెక్‌చేసుకొనే విధానాన్ని పరిశీలించారు. అదే విధంగా పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజన సదుపాయాలను, త్రాగునీటిని పరిశీలించారు. పరిశీలకుల వెంట నూజివీడు అసెంబ్లీనియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డిఓవై. భవానీశంకరి ఉన్నారు.

# ఆరా ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు

**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** 12 వ తేది ఆదివారం సత్యవతి నగర్ రోడ్ నెంబర్ 9 లో గల శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠము ఆశ్రమం వద్ద ఆరా ఫౌండేషన్, లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు ఘనముగా జరిగాయి. ప్రముఖ యోగ కోచ్ శ్రీ కరిబండి రామకృష్ణ సారధ్యం లో వారి అమ్మ లక్ష్మి సరస్వతి కి, పలువురు మాతృమూర్తి లకు పాద పూజ నిర్వహించి సన్మానం చేశారు. యోగ సాధకులు వారి వారి "అమ్మ" లను ఈ సందర్భంగా పూజించుకున్నారు. పలువురు అమ్మ ప్రేమ, ఆప్యాయతలను గూర్చి ఉపన్యాసం చేశారు. యోగ కోచ్ రామకృష్ణ మాట్లాడుతూ మాతృమూర్తి గొప్పతనం గురించి పిల్లలకు పెద్దలకు మనసుకు హత్తుకు నే విధంగా వివరించారు. తల్లి తండ్రి రుణం ఎన్నటికీ తీర్చ లేనిది అని అందుకే వారు ఉన్నత కాలం వారికి సేవలు చేస్తూ వారి మనసుని తృప్తిపరచాలని, పెద్ద వయసు లో ఉన్న అమ్మలను కంటికి రెప్పలా కాపాడు కోవాలని కోరారు. చిన్నప్పుడు పిల్లలు తిండి తినక పోతే ఎన్నో విధాలుగా బుజ్జగించి బువ్వ పెట్టిన అమ్మకు పెద్ద వయస్సు లో శరీరం సహకరించని స్థితిలో ఉన్న అమ్మలకు మనం కూడా అలానే బుజ్జగించి చిన్న పిల్లలలా చూసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల మీద దయ లేని పుత్రులు, పుత్రికలు గురించి యోగి వేమన పద్యం లో చెప్పిన



తాత్పర్యం వివరించారు. వారి ఆశీస్సులు ప్రతీ రోజు తీసుకుని బయటికి వెళ్లాలి వారి చల్లని దీవెనలు మన వెన్నంటి ఉండి మనల్ని క్షేమంగా ఇంటికి తిరిగి చేరుస్తాయి అన్నారు. వెల కట్టలేని, వర్ణించడానికి వీలు కాని కొలమానం లేని కాల పరిమితి లేని ప్రేమ "అమ్మ ప్రేమ" అన్నారు. ఈ కార్యక్రమంలో సుభద్ర గుప్తా, అంబిక, అమల, సుజాత, రేణుక, దేవి పలువురు ఆరా ఫౌండేషన్ యోగ సాధకులు మాతృమూర్తి లకు సన్మానం చేశారు.

# ఎన్నికల నేపథ్యంలో సెబ్ అధికారులకు విస్తృత దాడులు





**ఏలూరు, మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పి ఎన్ సూర్యచంద్రరావు ఆదేశాలపై రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా, గంజాయి, మధ్యము అక్రమ రవాణా జరగకుండా నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులను నిర్వహిస్తూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, చింతలపూడి, కైకలూరు, నూజివీడు స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. ఆదివారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్ పరిధి ఏలూరు, జంగారెడ్డిగూడెం పోలవరం చింతలపూడి కైకలూరు, నూజివీడు పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించి 5 ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ ను నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా 1 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. 10 కేసులను నమోదు పరిచారు. నాటు సారా 2 కేసులు 30 లీటర్ల 1000 బెల్లం ఊట ను స్వాధీనం చేసుకుని దానిని ధ్వంసం చేసినారు. డ్యూటీ పెయిడ్ 06 కేసులు 33.48 లీటర్ల స్వాధీనం చేసుకున్నట్టు, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రెండు కేసులు 35.4 లీటర్లు, మోటార్ సైకిల్స్ సదరు కేసులలో 10 లలో 9 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పి ఎన్ సూర్యచంద్రరావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

# పటిష్టంగా పోలింగ్ నిర్వహణకు సిబ్బందికి శిక్షణ

**దెందులూరు, మేజర్ న్యూస్:** దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గము పోలింగ్ నిర్వహణ సక్రమంగా జరుపుటకు గాను పోలింగ్ సిబ్బంది అందరికి శిక్షణ అందించినట్లు రిటర్నింగ్ అధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు హాజరైన పోలింగ్ సిబ్బందికి సంబంధిత అధికారుల పర్యవేక్షణలో ఎటువంటి సమస్యలు లేకుండా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. త్రాగునీరు, చలవ పందిళ్ళు, అల్పాహారంతో పాటు మధ్యాహ్నం రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేసారు. సర్. సి.ఆర్.ఆర్.మహిళా కళాశాల, వట్లూరులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నందు ఎన్నికల సిబ్బందికి ఎన్నికలకు సంబందించిన మెటీరియల్ ను ఇచ్చి ఏర్పాటు చేసిన 23 రూట్ల ప్రకారం బస్సుల ద్వారా 239 పోలింగ్ కేంద్రలకు పంపడమైనది- సిబ్బంది అందరు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఉన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రము నుండి 100 మీటర్ల దూరము వరకూ రాజకీయ పార్టీల వారు ఏవిధమైన ప్రచారము నిర్వహించరాదన్నారు. దెందులూరు నియోజకవర్గం లోని మొత్తం అన్ని 239 పోలింగ్ స్టేషన్ల నందు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయుటమైనది. పోలింగ్ కేంద్రముల వద్ద త్రాగు నీరు మరియు టెంట్లను, కుర్చీలను ఏర్పాటు చేయుటమైనదన్నారు. విభిన్న ప్రతిభావంత ఓటర్లు కొరకు వీల్ చైర్ సదుపాయము ఏర్పాటు చేయుటమైనదన్నారు. వృద్దులు బాలింతలు ఓటు వేయటానికి వచ్చినప్పుడు వారికీ ఇబ్బంది కలగకుండా చూడవలసినదిగా సూచనలు ఇవ్వడమైనదన్నారు. ఓటర్లకు వారి ఓటును ఓటరు జాబితా నందు పరిశీలించు కొనుటకు, పోలింగ్ కేంద్రము వద్ద బి ఎల్ వో లు ఉండే విధముగా చర్యలు తీసుకొనుట జరిగినదన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించడము కోసము 144 సి.ఆర్.పి.సి. సెక్షన్ తేది 14.05.2024 మంగళవారం సాయంత్రము 6.00 గంటల వరకు అమలులో ఉన్నందున చట్ట విరుద్ధమైన సమావేశములు బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించుట నిషేధము



ప్రజలు గుంపులు గుంపులు గా, ఐదుగురు కంటే ఎక్కువ ఉంటె చట్టపరముగా చర్యలు తీసుకోనబడునన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థి అనుమతి పొందిన 03 వాహనములు మాత్రమే ఉపయోగించవలెను, వాహనము నందు డ్రైవర్ తో కలిపి 5గురు మాత్రమే ప్రయానించవలెనన్నారు. తేది 13వ తేదీన అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట పోలిసు భద్రతను ఏర్పాటు చేయడమైనది . సెక్టార్ ఆదికారులకు పోలింగ్ సిబ్బందికి 13 వ తేదీన ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ ఉదయం 7.00 గంటలకు పోలింగ్ మొదలు పెట్టవలసినదిగా సూచనలు ఇవ్వడమైనదన్నారు. 13వ తేదీన పోలింగ్ నిర్వహణ తదుపరి పోల్ కాబడిన ఈ వి యం ఇతర పోలింగ్ మెటీరియల్ ను సర్.సి.ఆర్.ఆర్.ఇంజనీరింగ్ కళాశాల, వట్లూరు నందు ఏర్పాటు చేయబడిన రిసెప్షన్ సెంటర్ నందు తీసుకొనుటకు తగు ఏర్పాట్లు చేయడమైనది తెలిపారు.

# పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన

**చింతలపూడి, మేజర్‌న్యూస్ :** చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం ఎన్నికల సాదారణ పరిశీలకులు ఎస్.ఎ. రామన్ పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అదే విధంగా పోలింగ్ సామాగ్రిని పివోలు, ఎపివోలుకు అందించే విధానాన్ని , పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన ఆల్పాహారం, భోజన సదుపాయాలను ఆయన పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలను, ఈవిఎంలు, ఈవిప్యాట్లను, ఇతర పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్టు ద్వారా పోలింగ్ సిబ్బంది పరిశీలన చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. పరిశీలకుల వెంట చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డిఓ కె. అద్దయ్య ఉన్నారు.



# ఎన్నికల సామాగ్రి పంపిణీని పరిశీలించిన ఆర్డీవో దీప





**నరసాపురం, మేజర్‌న్యూస్:** వైఎన్ఎం కాలేజీ గ్రౌండ్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు.
ఎన్నికల పరిశీలకులు ఎం దీప, నరసాపురం ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి ఎం అచ్యుత అంబారీష్ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలో 169 పోలింగ్ స్టేషకు, సంబంధించిన ఎన్నికల సామాగ్రి సజావుగా సిబ్బంది తీసుకుని వెళ్ళుటకు 16 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1180, మంది పోలింగ్ సిబ్బందిని వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు తరలించుటకు 48, బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. 16 రూట్లకు16 సెక్టార్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. 1 సెక్టార్ అధికారిని రిజర్వుడులో ఉంచా మన్నారు. 22 సమస్యాత్మక గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను గుర్తించిడం జరిగిందన్నారు. పోలింగ్ స్టేషను పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 169 మంది పోలింగ్ సిబ్బందిని రిజర్వుడలో ఉంచాము అన్నారు . పోలింగ్ సిబ్బందికి ఆదివారం సాయంత్రం నుండి సోమవారం సాయంత్రం వరకు పోలింగ్ స్టేషన్లలో ఆహారం అందించే ఏర్పాట్లు పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు భద్రతా ఏర్పాట్లను చేయడం జరిగిందని నరసాపురం ఆర్డీవో ఎన్నికల అధికారి ఎం అచ్యుత అంబారిష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మున్సిపల్ కమిషనర్ డా: కె .వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శివుడు కళా సేవా స్రవంతి ఆధ్వర్యంలో ఘనంగా శంకర జయంతి వేడుకలు





**పెనుమంట్ర, మేజర్‌న్యూస్:** ఇప్పటికీ హిందూ ధర్మం గురించి ప్రతి ఒక్కరూ గొప్పగా చెబుతున్నారంటే అందుకు కారణం ఆదిశంకరాచార్యుల వారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని శివుడు కళా సేవా స్రవంతి గౌరవసలహాదారు, ఆర్మీ ఆఫీసర్ సుబేదార్ తోలేటి సుధీర్ కుమార్ (రిటైర్డ్) అన్నారు. ఆదివారం వనంపల్లి బ్రాహ్మణ రామాలయంలో శివుడు కళా సేవా స్రవంతి ఆధ్వర్యంలో ఆది శంకర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ జోశ్యుల వెంకట్రామ్ నేతృత్వంలో సుధీర్ కుమార్ , లావణ్య దంపతులు ఆదిశంకరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోశ్యులవెంకట్రావ్ మాట్లాడుతూ పన్నెండేండ్లకే ఆదిశంకరాచార్యుల వారు చేసిన మహత్‌కార్యాలను, దేశం నలుమూలలా స్థాపించిన పీఠాల వివరాలను, 16 ఏండ్లకు శంకరాచార్యులవారు అభ్యసించిన చతుర్వేదపారాయణాన్నికండ్లకు కట్టినట్లు వివరించారు. శంకరాచార్యుల వారి జననం, బాల్యం, విద్యాభ్యాసం, సన్యాస స్వీకారం, భక్తితత్వం, గ్రంధ రచన, దార్శనికతను సుభేదార్ తోలేటి సుధీర్ కుమార్ వివరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తోలేటి వెంకట సీతారామరాజు, రఘు , టి.సత్య సూర్య నారాయణ, సావిత్రి , దివ్యాన్ష్ , గౌరీ శంకర్ పాల్గొన్నారు